
సాక్షి
మెదక్
శనివారం । 15 । మార్చి । 2025



నీటి గంట మోగిద్దాం
వేసవి నేపథ్యంలో పాఠశాలల్లో వాటర్ బెల్ మోగించాల్సిన అవసరం ఉంది.
వివరాలు 8లో ▸



కలప అక్రమ వ్యాపారం
అల్లాదుర్గం మండలంలో కలప అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది.
వివరాలు 9లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శనివారం	ఆదివారం
సా. 6.31 గం.	ఉ. 5.02 గం.

న్యూస్‌రీల్

చిరుత దాడిలో దూడలు హతం



దూడల కళేబరాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి చిరుత దాడిలో రెండు దూడలు హతమయ్యాయి. గ్రామానికి చెందిన రైతు నక్కిర్తి స్వామి తన పశువులను రోజూ మాదిరిగానే వ్యవసాయ బావి వద్ద ఉంచగా, రాత్రి చిరుత దాడి చేసి హతమార్చింది. అక్కడికి సమీపంలో చిరుత పాద గుర్తులు గమనించిన రైతు శుక్రవారం ఉదయం అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అధికారులు మృతి చెందిన దూడల కళేబరాలను పరిశీలించారు.

జాతీయ కబడ్డీ క్యాంపునకు ఎంపిక

పాపన్నపేట(మెదక్): సబ్ జూనియర్ బాలికల, బాలుర విభాగంలో బాచుపల్లిలోని కాసాని జ్ఞానేశ్వర్ కబడ్డీ అకాడమీ క్యాంపునకు జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారని శుక్రవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీ రమేష్ వెల్లడించారు. బాలికల విభాగంలో రాధిక, బాలుర విభాగంలో నరేందర్ ఎంపికైనట్లు చెప్పారు. ఇటీవల వికారాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని ప్రతిభ చూపారని తెలిపారు.

108 కిలోల గుండు ఎత్తుకుని ప్రదక్షిణలు



గుండు ఎత్తుకొని ప్రదక్షిణ చేస్తున్న జ్ఞానేశ్వర్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం తుర్కాపల్లిలో హోలీ పండుగ సందర్భంగా బండరాళ్ల గుండ్లు ఎత్తుకుని గ్రామదేవత ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. శుక్రవారం హోలీ పండుగను పురస్కరించుకుని గ్రామానికి చెందిన యువకుడు సాతిని జ్ఞానేశ్వర్ 108 కిలోల బరువున్న బండరాయి గుండును అవలీలగా ఎత్తుకుని గ్రామదేవత ఆలయం చుట్టూ అయిదు ప్రదక్షణలు చేసి ఔరా అనిపించాడు. గ్రామ పెద్దలు కరతాళధ్వనులతో అతడిని ఉత్సాహపరిచారు. అనంతరం రంగులు చల్లుకుంటూ హోలీ పండును నిర్వహించుకున్నారు.

గొడవపడి.. గొంతుకోసి



భర్త దాడిలో గాయపడిన స్వాతి

కొడిపల్లి(నర్సాపూర్): కట్టుకున్న భార్యనే గొంతు కోసి కడతేర్చాలని చూశాడు ఓ భర్త. ఈసంఘటన మండల పరిధి తిమ్మాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన స్వాతిని బాలానగర్‌కు చెందిన రమేష్‌కు ఇచ్చి పదేళ్ల క్రితం పెళ్లి జరిపించారు. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. అయితే కొన్నేళ్లుగా భార్యపై అనుమానం పెంచుకున్న రమేష్ నిత్యం గొడవపడేవాడు. అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ క్రమంలో పలుమార్లు పెద్దలు కల్పించుకొని నచ్చచెప్పారు. అయినా అతడిలో మార్పురాలేదు. ఈనెల 6వ తేదీన సైతం స్వాతిని తీవ్రంగా కొట్టడంతో ఆమె తల్లిగారి ఊరు తిమ్మాపూర్‌కు వెళ్లింది. ఈక్రమంలో గురువారం సాయత్రం తిమ్మాపూర్ చేరుకున్న రమేష్ మాట్లాడేది ఉందని భార్యను గ్రామ శివారులోని హనుమాన్ ఆలయం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ గొడవపడి తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతు కోసేందుకు ప్రయత్నించాడు. దీంతో చేయి అడ్డుపెట్టడంతో స్వాతి తీవ్రంగా గాయపడింది. అరుపులకు చుట్టుపక్కల ఉన్న వారు రావడంతో రమేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు గాయపడిన స్వాతిని చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రగతి.. అధోగతి

రామాయంపేట మున్సిపాలిటీలో సమస్యల తిష్ట | **'సాక్షి' విజిట్‌లో వెలుగు చూసిన వాస్తవాలు**

మేజర్ పంచాయతీగా ఉన్న రామాయంపేట 2018లో మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఇక అన్నిరకాల అభివృద్ధి పనులు చకచకా జరుగుతాయని, సమస్యలుండవని భావించిన ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. నిధుల కొరతతో కొన్ని పనులు మధ్యలోనే నిలిచిపోగా.. చాలా వరకు ప్రారంభానికే నోచుకోకుండాపోయాయి. ఫలితంగా ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు.

– రామాయంపేట(మెదక్)



రామాయంపేట పట్టణం వ్యూ..

మల్లె చెరువు కలుషితం

పట్టణంలోని సిద్దిపేట రూట్‌లో ఉన్న మల్లె చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడానికి గతంలో రూ. 3.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ కొన్ని పనులు మాత్రమే చేసి నిలిపివేశారు. చెరువు కట్టపై కంకర పరిచి వదిలేయడంతో రెండేళ్లుగా పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు, ఆ దారి గుండా వెళ్లడమే మానేశారు. పట్టణంలోని కొన్ని వార్డులకు సంబంధించి మురుగు నీరు మల్లెచెరువులో వదులుతున్నారు. దీంతో చెరువు నీరు రంగు మారి దుర్వాసన వెదజల్లుతుంది. మురుగు నీటిని ఇతర ప్రాంతాలకు తరలించాలనే పట్టణవాసుల డిమాండ్ ఇప్పటికీ నెరవేరలేదు. చెరువు నీరు కలుషితంతో గతంలో పలుమార్లు చేపలు మృత్యువాతపడ్డాయి.



పత్తాలేని మినీ స్టేడియం

పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ. 2.65 కోట్లు మంజూరయ్యాయి. జాతీయ రహదారి పక్కనే స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలాన్ని కొంత మేర చదును చేయించిన కాంట్రాక్టర్ రూ. 20 లక్షల బిల్లులు డ్రా చేసుకొని పనులు మధ్యలోనే ఆపివేశారు. కాగా ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న రైతుల వద్ద నుంచి బలవంతంగా భూమిని లాక్కున్న అప్పటి ప్రభుత్వం స్టేడియం ఏర్పాటు చేయలేదు. దీంతో పట్టణంలో క్రీడా పోటీలు నిర్వహించుకోవడానికి సరైన మైదానం కరువైంది.

శిథిలం.. భయం భయం

పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బంది, రైతులు కార్యాలయం లోపలికి వెళ్లడానికే జంకుతున్నారు. దీని స్థానంలో మరో భవనం నిర్మాణానికిగాను ఆరేళ్ల క్రితం రూ. మూడున్నర కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ స్లాబ్ వరకు పూర్తిచేసి మిగితా పనులను మధ్యలోనే వదిలేశారు. నిధుల మంజూరు కోసం పలుమార్లు పట్టణ ప్రజలు నిరసన వ్యక్తం చేసినా స్పందన కరువైంది. ఈవిషయమై తహసీల్దార్ పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. మున్సిపాలిటీ పరిధిలోని రామాయంపేట, గుల్పర్తి, కోమటిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు పాక్షికంగా శిథిలమయ్యాయి. నూతన రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శివారు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలమైంది. తరచూ సిమెంట్ పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో సిబ్బందితో పాటు రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ భవనంలోనే సహాయ సంచాలకుల కార్యాలయంతో పాటు ఆస్పత్రి, గోదాం కొనసాగుతుండటం గమనార్హం.



ఆర్డీఓ కార్యాలయం బోర్డుకే పరిమితం

గత ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో రామాయంపేటకు ఆర్డీఓ కార్యాలయం మంజూరు చేసింది. కార్యాలయ ఏర్పాటు కోసం సుమారు ఏడు, ఎనిమిది నెలలపాటు పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగాయి. దీంతో అప్పటి ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా కార్యాలయం మంజూరు చేసింది. రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాలను ఇందులో చేర్చింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన భవనంలో కంప్యూటర్, కొద్దిమేర ఫర్నీచర్ మాత్రమే సమకూర్చారు. అయితే అధికారికంగా ప్రభుత్వం నుంచి గెజిట్ విడుదల కాకపోవడంతో మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కేవలం అటెండర్ పర్యవేక్షణలోనే మాత్రమే కార్యాలయం కొనసాగుతుంది.

డంప్‌యార్డుతో దుర్గంధం

పట్టణంలో ప్రతిరోజూ కనీసం తొమ్మిది మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతోంది. దీనిని ట్రాక్టర్లు, ఆటోల్లో తీసుకెళ్లి ఎక్కలదేవుని బండ పైభాగంలో ఆరుబయట వేస్తున్నారు. దీంతో ఆ పరిసరాల్లో దుర్గంధం వ్యాపించి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తున్న రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయకుండా, ఒకే చోట వేస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణం పూర్తయినా చెత్తను వేరు చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. అప్పుడప్పుడు చెత్తను చెరువు వద్ద ఖాళీ చేస్తుండటంతో నీరు కలుషితమవుతుంది.



రైతుబజార్ నిరుపయోగం



పట్టణవాసులకు కూరగాయలు, మాంసం ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా ఏడేళ్ల క్రితం రూ. 50 లక్షలతో రైతుబజార్ దుకాణ సముదాయం నిర్మించారు. కొద్దిరోజులపాటు ఇందులో వ్యాపారం కొనసాగించిన వ్యాపారులు అమ్మకాలు జరగడం లేదని ఇక్కడ వ్యాపారం మానుకున్నారు. కాగా సదరు రైతుబజార్ వ్యాపారానికి అనువుగా లేకపోవడంతో పట్టణ ప్రజలు సైతం అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. దీంతో అది మూతపడి నిరుపయోగంగా మారింది.

బస్‌డిపో స్థలం అన్యాక్రాంతం

రామాయంపేటలో బస్ డిపో ఏర్పాటు కోసం 20 ఏళ్ల క్రితం స్థానికులు తారు రోడ్డును ఆనుకుని విలువైన స్థలాన్ని ఆర్టీసీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. అప్పుడు సీఎం హోదాలో చంద్రబాబునాయుడు, అప్పటి రవాణాశాఖ మంత్రి కేసీఆర్ సదరు స్థలాన్ని పరిశీలించి హామీ ఇచ్చారు. తర్వాత ఈ విషయమై ఎవరూ పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో పడింది. దీంతో విలువైన స్థలం అన్యాక్రాంతమవుతుంది.

అసంపూర్తిగా మార్కెట్ నిర్మాణం

పట్టణంలోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ సదుపాయం లేకపోవడంతో కూరగాయలు, మాంసం అమ్మకాలు రోడ్డు పక్కనే కొనసాగిస్తున్నారు. దీంతో దుమ్ము, ధూళితో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం ఎంపీపీ కార్యాలయ ఆవరణలో మార్కెట్ భవన సముదాయ నిర్మాణానికి రూ. మూడు కోట్లు మంజూరు చేసింది. కాగా ఆ నిధులు వెనక్కి మళ్లిపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను పిల్లర్లస్థాయిలో ఆపివేశాడు. ప్రసుత్తం వారాంతపు సంత పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద చిన్న గల్లీలో కొనసాగుతుండగా ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు.



సమస్యలు పరిష్కరించాలి



మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో కనీస వసతులు కానరావడం లేదు. కొత్తగా ఏర్పడిన ఈ కాలనీలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు కరువయ్యాయి. వీధి లైట్లు సరిగా వెలగడం లేదు. పట్టణం నుంచి కాలనీకి వెళ్లడానికి రహదారి సదుపాయం లేకపోవడంతో పంట చేల గుండా వెళ్లాల్సి వస్తుంది.

– బాలమణి, డబుల్ బెడ్రూం కాలనీ

కుక్కల బెడదను అరికట్టాలి



కాలనీలో కుక్కల బెడద తీవ్రమైంది. ఇప్పటికే చాలా మందిపై దాడులు చేసి గాయపర్చాయి. ఈవిషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. కాలనీలో రహదారులు, మురుగు కాలువలు నిర్మించాలి. ఎప్పుడో నిర్మించిన రోడ్లు, మురుగు కాలువలు పాక్షికంగా శిథిలమయ్యాయి.

– బసన్నపల్లి ముత్యాలు, దుర్గమ్మ వీధి

ఎవరూ పట్టించుకోవడం లేదు



తమ కాలనీ బాగు విషయమై ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్లు, మోరీలు లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందు నుంచి వెళ్తుంది. దీంతో ప్రతి రోజూ గొడవలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుంచి కాలనీ మీదుగా డబుల్ బెడ్రూం వరకు రోడ్డు నిర్మించి వీధి లైట్లు అమర్చాలి.

– పోచమ్మల రాజవ్వ, హమాలీ కాలనీ

నిధులు మంజూరైతేనే..



మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలన్నీ నిధులతో ముడిపడి ఉన్నవే. పట్టణం, శివారు గ్రామాల్లో కొన్ని అభివృద్ధి పనులు చేశాం. ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని పనులు చేపడుతాం. ప్రజలు సహకరించాలి.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్

నమూనా.. పూర్తయ్యేనా?

ముందుకు సాగని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మెదక్‌జోన్: ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగడం లేదు. ఇళ్లు మంజూరై రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు నిర్మాణాలు మొదలు కాలేదు. కాగా ప్రతి మండల కేంద్రంలో నమూనా ఇంటిని నిర్మిస్తామని, దాని మాదిరిగా లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని అధికారులు చెప్పారు. కానీ జిల్లాలో ప్రస్తుతం ఒక్క నమూనా ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు.

జిల్లాలో 1,555 ఇళ్లు మంజూరు

జిల్లాలో 21 మండలాలు ఉండగా, పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆ గ్రామాల్లో నిబంధనల ప్రకారం ఇల్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. పూరి గుడిసె, రేకులషెడ్లు ఉండి సొంత స్థలం ఉన్నవారికి రెండో ప్రాధాన్యం, మట్టిగోడలు, పెంకుటిల్లు ఉన్న వారిని వరుస క్రమంలో ఎంపిక చేశారు. వీరికి మొదటి విడతగా 1,555 ఇళ్లను మంజూరు చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం నాలుగు విడతల్లో అందజేస్తామని చెప్పారు. కాగా ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మిస్తామని, దాని మాదిరిగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని అధికారులు సూచించారు. కాగా ఇప్పటివరకు మెదక్, రామాయంపేట, నర్సాపూర్, పెద్దశంకరంపేట, కొడిపల్లి, కొల్చారం, రేగోడ్, పాపన్నపేట మండల కేంద్రాల్లో మాత్రమే నమూనా ఇంటి నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఒక్క మండలంలో పూర్తిస్థాయిలో నమూనా ఇంటి నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఇళ్లు మంజూరైనా లబ్ధిదారులు పనులు ప్రారంభించటం లేదు. నమూనా ఇంటి నిర్మాణం పూర్తి చేస్తే దాని ఆధారంగా నిర్మిస్తామని చెబుతున్నారు.

లబ్ధిదారుల పెదవి విరుపు!

గత ప్రభుత్వం జిల్లాలో కేవలం 2,500 డబుల్ బెడ్రూం ఇళ్లను మాత్రమే నిర్మించి ఇచ్చింది. దీంతో చాలా మంది ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు పెట్టుకున్నారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటికి సింగిల్ బెడ్రూం మాత్రమే కేటాయించింది. దీనికి తోడు పిల్లర్లు లేకుండా గోడలపైనే స్లాబ్ వేయాలనే నిబంధన ఉండటంతో లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. అదనంగా డబ్బులు వేసుకొని పిల్లర్లతో డబుల్ బెడ్రూం నిర్మించుకునేందుకే ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అధికారులు సరైనా సలహాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు.



మెదక్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న నమూనా ఇల్లు

నిర్మాణంలో ఉన్నాయి

ముందుగా అన్ని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ నమూనా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాం. వాటి ఆదారంగా లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలనే నిబంధన ఉంది. అయితే లబ్ధిదారుడు అదనంగా డబ్బులు వేసి కట్టుకోవాలంటే 500 చదరపు అడుగులు మించకుండా ఉండాలి.

– యాదగిరి, హౌసింగ్ డీఈ

ముంబై సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న నీలం

పుట్టినరోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు



గణనాథుని సన్నిధిలో నీలం మధు

పటాన్‌చెరుటౌన్: తన జన్మదినాన్ని పురస్కరించుకుని ముంబైలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం సిద్ధి వినాయకుడిని శుక్రవారం కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ... తమ కోరికలు తీర్చుకునేందుకు దేశవ్యాప్తంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులవుతారన్నారు. ప్రతీ గణేశ్ దేవాలయాల్లో వినాయకుడికి తొండం ఎడమవైపు ఉంటుందని కానీ ఈ దేవాలయంలో మాత్రం తొండం కుడివైపు ఉండటంతోపాటు తొండంలో మూడో కన్ను ఉంటుందన్నారు. ఇంతటి ప్రత్యేకతలు ఉన్న సిద్ధి వినాయకుడిని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయన్నారు. సిద్ధి వినాయకుడిని దర్శించుకోవడం చాలా ఏళ్లుగా తనకు అలవాటని అందులో భాగంగా తన పుట్టినరోజు సందర్భంగా వినాయకుడిని దర్శించుకున్నానన్నారు. ఆ సిద్ధి వినాయకుడు ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

హోలీ.. ఆనంద కేళి

జిల్లావ్యాప్తంగా హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. వివిధశాఖల అధికారులు, సిబ్బందితో కలిసి హోలీ ఆడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతాభావంతో దేశంలో జరుపుకునే సంబరాల్లో హోలీ పండుగ ఒకటని అన్నారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో పాటు రెవెన్యూశాఖ అధికారులు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

–మెదక్‌జోన్



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్, ఇతర అధికారుల సందడి



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో అధికారులు



కొల్చారం: హోలీ వేడుకల్లో యువకులు



శివ్వంపేట: డోలుతో సందడి



మెదక్ కలెక్టరేట్: హోలీ సంబురాల్లో మెదక్ ఆర్డీఓ రమాదేవి

నీటి గంట మోగిద్దాం

- ఆరోగ్యంగా ఉండడానికి తగినంత నీరు అవసరం
- వేసవి నేపథ్యంలో విద్యార్థులకు తప్పనిసరి
- పాఠశాలల్లో అమలు చేయాలి
- వైద్యులు, విద్యావేత్తల సూచన
- జిల్లాలో విద్యనభ్యసిస్తున్న 1.30 లక్షల మంది విద్యార్థులు


ప్రభుత్వ పాఠశాలలో నీళ్లు తాగుతున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): వేసవికాలం నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో వాటర్‌ బెల్‌ మోగాల్సిన అవసరం ఉంది. ఎండాకాలం వచ్చిందంటే చాలు నాలుక తడారిపోతుంది. గుక్కెడు నీరు తాగితే బాగుండు అనిపిస్తుంది. ఒక్కోసారి సమయానికి తాగునీరు దొరకదు. పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉంటుంది. ఉదయం పాఠశాలలకు వెళ్లే పిల్లలు చాలా మంది ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకోరు. ఒక వేళ తెచ్చుకున్నా.. తాగడానికి సమయం దొరక్కపోవడం, కంటిన్యూగా తరగతులు జరిగినప్పుడు మధ్యలో వెళ్లి తాగలేని పరిస్థితి ఉంటుంది. దీంతో డీ హైడ్రేషన్‌కు గురవుతారు. రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలల్లో వాటర్‌ బెల్‌ మోగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ఐదేళ్లుగా మరిచారు

జిల్లాలో 2019 నవంబరులో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్‌ బెల్‌ కార్యక్రమాన్ని అమలు చేశారు. కొవిడ్‌ తర్వాత పాఠశాలలు తిరిగి ప్రారంభమైనప్పటికీ చాలా రోజులు, భౌతిక దూరం, వ్యక్తిగత శుభ్రత వంటి నియమాలతో దృష్టి పెట్టలేదు. కేరళ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలను స్ఫూర్తిగా తీసుకొని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతీ రోజు మూడు సార్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో రోజూ మూడు సార్లు వాటర్‌ బెల్‌ మోగించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం బెల్‌ కొట్టినప్పుడు ప్రతీ విద్యార్థి నీరు తాగేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించేవారు. మినరల్‌ వాటర్‌ లేని పాఠశాలల్లో ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించారు. నిర్ణీత రోజుల్లో ట్యాంకులు శుభ్రం చేయడం, తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, అనుమానం వస్తే నీటి పరీక్షలు నిర్వహించడం వంటివి గతంలో జరిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో వాటర్‌ బెల్‌ మోగించడంపై ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. వేసవికాలం నేపథ్యంలో ఇప్పటికైనా పాఠశాలల్లో వాటర్‌ బెల్‌ మోగించడానికి అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

నీరు తక్కువైతే అనారోగ్యం

పిల్లలు ఆటలో పడి నీళ్లు తక్కువ తాగితే దుష్ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పాఠశాల సమయంలో 1.5 లీటర్ల మేర నీరు తీసుకుంటే మేలు. ఎక్కువ సార్లు మూత్రశాలకు వెళ్లాల్సి వస్తోందన్న కారణంతో తాగడం లేదు.సరైన మోతాదులో నీరు తాగకపోవడం వల్ల జ్వరం మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రంలో ఇన్‌ఫెక్షన్‌, కాలేయం, చర్మ, జీర్ణ సంబంధిత సమస్యలు విద్యార్థుల్లో తలెత్తుతున్నాయి. సరిపడా మంచినీళ్ల తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది.

– శ్రీనివాస్‌ రెడ్డి, పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లయితే పక్కాగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో ప్రస్తుతం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఖచ్చితంగా అమలు చేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

క్లుప్తంగా

మల్లన్న ఆలయ హుండీలపై పర్యవేక్షణ కరువు

నగదు చోరీకి యత్నించిన వ్యక్తి


నగదును అపహరించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలు, ఒడి బియ్యం హుండీలపై ఆలయ అధికారుల పర్యవేక్షణ కరువైంది. సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికీ ఆలయ అధికారుల డొల్లతనం మరోమారు బయటపడింది. స్వామి వారి అర్ధమండపం, ముఖమండపంలోని పలు హుండీలు సిబ్బంది కనుసన్నల్లో ఉండగా, గంగిరేణు చెట్టు ప్రాంగణంలో ఉన్న పలు హుండీలను ఎవరూ పట్టించుకోకపోవడం వివాదాస్పదమవుతుంది. సీసీ కెమెరాలు ఉన్నా పరిశీలించే వారు కరువయ్యారు. ఇటీవలె గుర్తుతెలియని వ్యక్తి దర్జాగా గంగిరేణు చెట్టు ప్రాంగణంలో వీవీఐపీ క్యూలైన్‌ సమీపంలో ఉన్న ఓ హుండీలో కనిపిస్తున్న నగదును ఇనుప చువ్వతో అపహరించేందుకు యత్నించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు.ఈ ఫొటోలు శుక్రవారం సోషల్‌ మీడియాలో హల్‌చల్‌ చేశాయి.

మహిళను కాపాడిన పోలీసులు

చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం


మహిళను కుటుంబీకులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీసులు కాపాడారు. ఈ ఘటన గుమ్మడిదల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన బక్క రేణుక (35) శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని ఎర్ర చెరువులో దూకి ఆత్మహత్యకు ప్రయత్నిస్తుండగా బందోబస్తు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌ అద్వైత రెడ్డి గమనించి ఎస్‌ఐకి సమాచారం అందించారు. ఎస్‌ఐ పెట్రోలింగ్‌ చేస్తున్న సిబ్బంది కిషోర్‌ సాయి వర్ధన్‌కు చెప్పి వెళ్లి మహిళను కాపాడాలని సూచించారు. కానిస్టేబుళ్లు ఇద్దరూ చెరువులోకి వెళ్తున్న మహిళను ఆపి నచ్చజెప్పి ఇంటి వద్దకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కల్లు గీస్తుండగా చెట్టుపై నుంచి పడి గాయాలు

నంగునూరు(సిద్దిపేట): తాడిచెట్టుపై నుంచి పడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కొండంరాజ్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నల్లూరి మోహన్‌గౌడ్‌ కల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కల్లుగీతపై ఆధారపడి జీవిస్తున్న మోహన్‌గౌడ్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అక్రమంగా షెడ్డు నిర్మాణం


అనుమతి లేకుండా నిర్మిస్తున్న షెడ్డు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా షెడ్డు నిర్మాణం కొనసాగుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు వరుసగా వార్తా పత్రికల్లో కథనాలు వస్తున్నప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. కళ్లెదుటే షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా అక్రమార్కులు దర్జాగా నిర్మాణాలు చేపడుతుంటే పట్టించుకోకపోవడం సరికాదంటున్నారు. ఇప్పటికైనా స్పందించి అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి, తదితరులు

అమరుల త్యాగాలు మరువలేనివి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్‌: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి పేదలను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయడంలో అసువులుబాసిన అమరవీరుల త్యాగాలు మరువ లేనివని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మహ్మదాపూర్‌ గుట్టల్లో అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి 77వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ పేదలను దొరలు, భూస్వాములు దోపిడీ చేస్తుంటే అనాడు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశామన్నారు. కరీంనగర్‌ ప్రాంతం నుంచి అనభేరి ప్రభాకర్‌, సింగిరెడ్డి భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో సాయుధ దళాలను ఏర్పాటు చేసుకొని పోరాటం చేశారని కొనియాడారు. మహ్మదాపూర్‌లో అనభేరి, సింగిరెడ్డిల సాయుధ దళాలు షెల్టర్‌ తీసుకున్న సమాచారంను రజాకార్లు తెలుసుకున్నారు. రాత్రి సమయంలో ఊరిని చుట్టుముట్టి దాడి చేయడంతో 13 మంది అమరులయ్యారన్నారు. తెలంగాణ ఉద్యమ కారులను బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో గుర్తింపు ఇవ్వలేదని, సీఎం రేవంత్‌ రెడ్డి ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. అనంతరం అమరుల సమాధుల వద్ద వెంకటరెడ్డి నివాళులర్పించారు. అనంతరం చాడ సమక్షంలో గజ్వేల్‌ నియోజకవర్గం బీఎస్పీ నాయకుడు కానుగుల రమనాకర్‌ సీపీఐలో చేరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌, గడిపె మల్లేశ్‌, వనేష్‌, కొమ్ముల భాస్కర్‌, సంజీవరెడ్డి, కృష్ణ, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మూడింట.. మణికంఠ

- గ్రూప్స్‌ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు
- సత్తాచాటిన హుస్నాబాద్‌ యువకుడు


తల్లిదండ్రులతో మణికంఠేశ్వర్‌ రెడ్డి

హుస్నాబాద్‌: గ్రూప్‌ పరీక్షల్లో వరుస ర్యాంక్‌లు సాధించి ఔరా అనిపించుకున్నాడు. హుస్నాబాద్‌ పట్టణానికి చెందిన అయిలేని మణికంఠేశ్వర్‌ రెడ్డి తండ్రి అయిలేని శ్రీనివాస్‌ రెడ్డి హైదరాబాద్‌లో అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ పని చేస్తున్నాడు. తల్లి అనిత మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్‌ పర్సన్‌. మణికంఠేశ్వర్‌ రెడ్డి తొలుత 6 నెలలు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేశాడు. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం నచ్చక గ్రూప్స్‌కు ప్రిపేర్‌ అయ్యాడు. ఇతను హైదరాబాద్‌లోని శ్రీనిధి కళాశాలలో బీటెక్‌, నిజాం కాలేజీలో ఎంబీఏ పూర్తి చేశాడు. తొలుత గ్రూప్‌ 4లో 600 ర్యాంక్‌ సాధించి రంగారెడ్డిలోని ఎండోమెంట్‌ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అలాగే, 11న వెలువడిన గ్రూప్‌ 2లో 103వ ర్యాంక్‌ సాధించాడు. శుక్రవారం వెలువడిన గ్రూప్‌ 3లో 62వ ర్యాంక్‌తో మెరిసాడు. గ్రూప్‌ 2 ఎంపిక చేసుకొని భవిష్యత్‌ గ్రూప్‌ 1 మంచి ర్యాంక్‌ను సాధించి ఉన్నత స్థాయి ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తానని చెప్పుకొచ్చాడు. మణికంఠేశ్వర్‌ రెడ్డి చిన్నతనం నుంచే చదువుల్లో మంచి ఫలితాలు సాధిస్తూ వస్తున్నాడని తల్లిదండ్రులు శ్రీనివాస్‌ రెడ్డి, అనిత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీ తాగడానికి వెళ్తుండగా బైక్‌ ఢీకొని వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిమ్మారెడ్డిపల్లి మధిర సార్లవాడకు చెందిన ఎంకు చంద్రయ్య(60) వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం సార్లవాడ నుంచి సమీపంలోని కొమురవెల్లి కమాన్‌ వద్ద ఉన్న హోటల్‌కి టీ తాగడానికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్‌ నుంచి హైదరాబాద్‌ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు చంద్రయ్యను ఢీకొట్టి వెళ్లాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌ పేర్కొన్నాడు.

బ్రిడ్జిపై నుంచి పడి వ్యక్తి మృతి


శేఖర్‌(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): ప్రమాదవశాత్తు బ్రిడ్జి పై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధి వడియారం గ్రామ శివారులోని రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. చేగుంటకు చెందిన పులబోయిన శేఖర్‌(26) గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. శుక్రవారం వడియారం రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద శేఖర్‌ మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ పంచనామా నిర్వహించారు. ప్రమాదవశాత్తు బ్రిడ్జిపై నుంచి కిందపడటంతో మృతి చెంది ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి..


వెంకట్‌(ఫైల్‌)

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని హద్నూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్‌ కథనం మేరకు.. న్యాల్‌కల్‌కు చెందిన వడ్డె వెంకట్‌(32) ఈనెల 12న ఉదయం ఇంట్లో చెప్పి చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో 13న తల్లి పూలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం ఉదయం హద్నూర్‌ గ్రామ శివారులోని చెరువులో మృతదేహం తేలినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ చెట్టును ఢీకొని యువకుడు


ప్రశాంత్‌ (ఫైల్‌)

తొగుట(దుబ్బాక): బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెజ్జ రమైన ప్రశాంత్‌ (28) ఉదయం మిరుదొడ్డికి వెళ్లాడు. సాయంత్రం తిరిగొస్తుండగా గ్రామ శివారులో బైక్‌ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స కోసం గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య వర్షిణి, కూతురు శన్విక, కుమారుడు శశాంక్‌ ఉన్నారు. ప్రమాద ఘటన తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి గజ్వేల్‌ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యం


శంకరయ్య

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సుభాష్‌ గౌడ్‌ కథనం మేరకు.. మనోహరాబాద్‌ మండలంలోని కాళ్లకల్‌ గ్రామానికి చెందిన కూతురు శంకరయ్య (60), భూలక్ష్మీ దంపతులు హోటల్‌ నడుపుతూ జీవిస్తున్నారు. 20 రోజుల కిందట భార్యాభర్తలు గొడవ పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన శంకరయ్య శుక్రవారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఫోన్‌ చేస్తే స్విచ్ఛాఫ్‌ రావడంతో చుట్టు పక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. శంకరయ్య కుమారుడు మహేశ్‌ గౌడ్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండపాక(గజ్వేల్‌): హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు. మండలంలోని అహ్మదీపూర్‌కు చెందిన మంద స్వామి(40) తన భార్య పిల్లలతో కలిసి గత 12న కుకునూరుపల్లిలో పెద్దమ్మ కల్యాణోత్సవం సందర్భంగా అత్తారింటికి వెళ్లారు. పండుగ అనంతరం ద్విచక్ర వాహనంపై అహ్మదీపూర్‌కు తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో తిప్పారం శివారులోకి వచ్చేసరికి వాహనం అదుపుతప్పి పడిపోవడంతో స్వామి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మొదట గజ్వేల్‌లోని ఆస్పత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమిం శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పెళ్లి కుదరడంలేదని యువకుడి బలవన్మరణం


శివరాజ్‌(ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం మడూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణ గౌడ్‌ కథనం మేరకు.. మండలంలోని మడూర్‌ గ్రామానికి చెందిన శివరాజ్‌(24)కు కొద్ది రోజులుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కానీ ఎక్కడా సంబంధం కుదరడం లేదు. దీంతో మనోవేదనకు గురయ్యాడు. గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అర్ధరాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో తండ్రి యాదగిరి, మరో రైతు సత్యనారాయణతో కలిసి పొలం వద్దకు వెళ్లి చూశారు. అప్పటికే పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తండ్రి యాదగిరి శుక్రవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భార్యతో గొడవపడి భర్త..

పటాన్‌చెరు టౌన్‌: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన సుభాష్‌ సాకేత్‌(27) బతుకుదెరువు కోసం పటాన్‌చెరుకు వచ్చాడు. మండల పరిధిలోని పెద్ద కంజర్ల గ్రామంలో గల అరబిందో వెంచర్‌లో మేస్త్రీ వద్ద కూలీగా పని చేస్తూ అక్కడే షెడ్‌లో ఉంటున్నాడు. గురువారం రాత్రి ఫోన్‌లో భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి వెంచర్‌లోనే ఓ చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి మృతుడి సోదరుడు విశాల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అదృశ్యమైన వ్యక్తి చెరువులో మృతదేహమై లభ్యం


మహబూబ్‌ మృతదేహం

సంగారెడ్డి క్రైమ్‌: ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి పట్టణంలోని మార్ఫ్‌నగర్‌ చెరువులో మృతదేహమై లభ్యమయ్యాడు. పట్టణ సీఐ రమేశ్‌ కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణంలోని మార్ఫ్‌నగర్‌ కాలనీకి చెందిన షేక్‌ మహబూబ్‌(40) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 12న తన యజమాని కల్వకుంటకు చెందిన అక్బర్‌ ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం కల్వకుంట నుంచి చిమ్నాపూర్‌ గ్రామానికి వెళ్లే మార్గంలో గల ఎర్రకుంట చెరువు ఒడ్డున మహబూబ్‌కు చెందిన దుస్తులు, చెప్పులు కనిపించాయి. కుటుంబ సభ్యులు వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహం కోసం గాలించినా దొరకలేదు. పక్కనే దీనికి అనుకొని ఉన్న మరో చెరువు మార్ఫ్‌నగర్‌ చెరువులో శుక్రవారం ఉదయం పోలీసులు మున్సిపాలిటీ సిబ్బందితో గాలిస్తుండగా మృతదేహం లభ్యమైంది. కుటుంబీకులకు సమాచారం ఇచ్చి మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇదేనా గౌరవం!

సర్వే ఎంట్రీ ఆపరేటర్‌లకు అందని గౌరవ వేతనం
- ఒక్కో ఫామ్‌కు రూ.30 చెల్లిస్తామని ప్రకటన
- 4 నెలలుగా మంజూరుకాని వైనం
- జిల్లా వ్యాప్తంగా 3,051 మంది

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణన సర్వే చేపట్టింది. సమర్థవంతంగా ప్రక్రియ నిర్వహించేందుకు డేటా ఆపరేటర్‌ల నియామకానికి దరఖాస్తులు సైతం ఆహ్వానించింది. ప్రభుత్వ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్న యువత దినసరి కూలీలుగా మారారు. రోజువారి వేతనం కింద జిల్లా వ్యాప్తంగా కులగణన ప్రక్రియను వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేసి సమర్థవంతంగా పూర్తి చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. నిరుద్యోగులకు ఇచ్చిన మాటను జిల్లా అధికార యంత్రాంగం తప్పింది. రోజువారి వేతనం కింద డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాన్ని ఇంత వరకు అందించలేదు. రోజులు, నెలలు గడుస్తున్నప్పటికీ తాము చేసిన కూలీకి సంబంధించిన వేతనం ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోవడతో అభాగ్యులు అధికారుల చుట్టూ మొర ఆలకించాలని ప్రదక్షిణలు చేస్తున్నారు. వినతిపత్రాలు సైతం అందజేస్తున్నారు.

రూ.కోటి పై చిలుకు

గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను పట్టణాలు, గ్రామాల్లో అధికారులు సమర్థవంతంగా చేపట్టారు. ఆయా కుటుంబాల సర్వే దరఖాస్తులను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేయాలి. ఇందుకు గాను ఒక్క దరఖాస్తు ఫారమ్‌ ఎంట్రీ చేసినందుకు రూ. 30 చెల్లిస్తామని నిరుద్యోగ యువతను డేటా ఆపరేటర్‌లుగా నియమించారు.


అధికారికి వినతిపత్రం ఇస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 3,051 మంది డేటా ఆపరేటర్‌లను నియమించారు. వారితో కులగణన సర్వే ఫారాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేయించారు. వెబ్‌సైట్‌లో ఎంట్రీ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం చెల్లిస్తామన్న వేతనం ఇప్పటికీ చెల్లించలేదు. దీంతో తమకు చెల్లించాల్సిన డబ్బుల కోసం రోజూ అధికారుల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. అయినా ప్రభుత్వంలో చలనం రావడం లేదంటూ యువత ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆపరేటర్‌లకు సుమారు రూ.కోటి పై చిలుకు డబ్బులు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

తిరిగి వేసారి పోతున్నాం..



డేటా ఎంట్రీ చేసి నాలుగు నెలలు అవుతుంది. రూ.10 వేల పైచిలుకు డబ్బులు రావాలి. డబ్బుల కోసం రోజూ అధికారుల చుట్టూ తిరిగి వేసారి పోతున్నాం. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. తమకు రావాల్సిన డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– ఆనంద్‌, డేటా ఎంట్రీ ఆపరేటర్‌, చిన్నకోడూరు

నివేదిక పంపాం

కులగణన సర్వేకు సంబంధించి డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు ఇవ్వాల్సిన డబ్బుల విషయమై జిల్లా అధికారులకు, ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం డబ్బులు మంజూరు చేయగానే ఆపరేటర్‌లకు అందజేస్తాం. జాప్యం జరిగిన విషయం వాస్తవమే.

–హరికిరణ్‌, తహసీల్దార్‌ చిన్నకోడూరు

పండుగ పూట విషాదం

స్నానానికి వెళ్లి బావిలో మునిగి యువకుడి మృతి


శివకుమార్‌(ఫైల్‌)

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మండల పరిధిలోని వడ్డి గ్రామంలో హోలీ పండుగ రోజున విషాదం అలుముకుంది. బావిలో స్నానానికి వెళ్లి నీట మునిగి యువకుడు మృతి చెందాడు. హద్నూర్‌ ఎస్‌ఐ రాజశేఖర్‌ కథనం మేరకు.. వడ్డి గ్రామానికి చెందిన శివకుమార్‌(19) శుక్రవారం మిత్రులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం ఐదుగురు మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు స్నానం చేసేందుకు వెళ్లారు. శివకుమార్‌తోపాటు ఆనంద్‌కు ఈత రాకపోవడంతో స్నానానికి వెళ్లొద్దని తోటి మిత్రులు సూచించారు. అయినా వినకుండా తాడు సాయంతో బావిలోకి దిగడంతో నీట మునిగి మృతి చెందాడు. బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో శివకుమార్‌ మృతదేహం లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. వారి మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.